సిబ్బందిని అభినందిస్తున్న మేయర్, ఎమ్మెల్యేలు, కమిషనర్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సృజన హెచ్చరిక

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్షేత్రస్థాయిలో నకిలీ విత్తనాల విక్రయాల షాపుల తనిఖీలను ముమ్మరం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులతో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... సబ్సిడీ విత్తన పంపిణీకి సంబంధించి మండలాల వారీగా రైతులకు వేరుశనగ, కందులు, మినుములు, కొర్ర వివిధ రకాల విత్తనాలు రైతులకు ఎంత అవసరం ఉంది, ఎంత సరఫరా చేశారు అనే వివరాలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ విత్తనాల అమ్మకాలు విక్రయించే అంశంపై పత్రికల్లో వ్యతిరేక కథనాలు వస్తున్నాయని, ఆ మేరకు వాటిపై తనిఖీలు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. నకిలీ విత్తనాలతో మోసపోకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున డాక్టర్ వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశారన్నారు. అందులో రైతులు తీసుకొచ్చిన విత్తనాలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇంతవరకు ఎంతమంది రైతులకు సంబందించిన శాంపిల్స్ తీసుకున్నారో వివరాలు తనకు అంద చేయాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ టెస్టింగ్ ల్యాబ్స్‌లో విత్తనాలు పరీక్షలు చేస్తారని, రైతులలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. చిరుధాన్యాలను ప్రోత్సహించడంలో భాగంగా సాగు విస్తీర్ణం పెంచే విధంగా రైతులలో అవగాహన కల్పించడంతో పాటు మండలాల వారిగా లక్ష్యాలు నిర్దేశించుకొని వాటి సాధనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అదేశించారు. పిఎం కిసాన్ ఇకెవైసి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల ఆత్మహత్యలకు సంబంధించి నివేదికలు పెండింగులో లేకుండా చూసుకోవాలన్నారు. సమీక్షలో వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎపిఎంఐపి పిడి ఉమాదేవి, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామచంద్రయ్య, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, మత్స్యశాఖ అధికారి శ్యామల, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ షర్మిల, మార్కెటింగ్ శాఖ అధికారి నారాయణమూర్తి, మార్కెఫెడ్ మేనేజర్ రాజు పాల్గొన్నారు.

వారంలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టండి :కలెక్టర్

గ్రామాల్లో ఒకసారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ ఖాతాల్లో ఎంత నగదు ఉంది, పారిశుధ్య కార్మికులకు ఎంత మేర జీతాలు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్ ఎంత మేరకు వసూలు చేశారని, తదితర వివరాలను కూడా వచ్చే సమావేశానికి సిద్ధం చేయాలన్నారు. కోడుమూరు, మద్దికెర మండలాల్లో వంద శాతం క్లాప్ మిత్రల ద్వారా పరిశుభ్ర కార్యక్రమాలు ఎలా చేపట్టారని సంబంధిత ఇఒఆర్‌డిలను కలెక్టర్ అడిగారు. కొంత మందికి పంచాయతీ నిధుల ద్వారా చెల్లించడం ద్వారా వారు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు, పంచాయతీ నిధుల ద్వారా ఎంత మందికి చెల్లిస్తున్నారనేది పూర్తి స్థాయి నివేదిక అందించాలని డిపిఒను కలెక్టర్ ఆదేశించారు. ఒడిఎఫ్ ప్లస్ కు సంబంధించి ఎన్ని ఇళ్లకు మరుగు దొడ్లు ఉన్నాయని, అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలలో ఎన్ని మరుగుదొడ్లు ఉన్నాయని, వాటిలో ఎంత శాతం వినియోగంలో ఉన్నాయి అనే వివరాలు తెలపాలన్నారు. వారంలో ప్రతి బుధవారం గ్రామాల్లోని రహదారులు, పాఠశాలలు, నీటి ట్యాంకుల దగ్గర శ్రమదాన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, ప్లాస్టిక్‌ను సమర్ధవంతంగా నిర్మూలించడానికి ఒకసారి ప్లాస్టిక్ వినియోగంపై గ్రామ సభల్లో తీర్మానం చేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి వాటి వినియోగం తగ్గించేలా కృషి చేయాలని ఇఒఆర్‌డిలను కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఎంతమేర కాలువలు ఉన్నాయో సదరు రిపోర్ట్ అందజేయాలన్నారు. జగనన్నశాశ్వత భూహక్కు , భూరక్ష కార్యక్రమానికి సంబంధించి 67 ఓఆర్ఐ మ్యాప్స్‌రాగా, వాటిలో 41 గ్రామాలు గ్రౌండ్ ట్రుతింగ్ చేశామని, గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తి చేశామని, గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తి అయిన వాటికి డ్రాఫ్ట్ ఆర్‌ఒఆర్ పబ్లిష్ చేసిన తర్వాత ఫైనల్ ఆర్‌ఒఆర్ ప్రాసెస్ పూర్తిచేస్తున్నామని డిపిఒ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను జూన్ 15లోపు పురోగతి చూపాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు. నాడు-నేడు ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్ల వివరాలు మరుసటి సమావేశంలో ఉంచాలన్నారు. పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, డిపిఒ నాగరాజు నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, డిఎల్‌పిఒలె ఈఓఅర్డిలు పాల్గొన్నారు.

ప్రజల సహకారం అద్వితీయం

- ఆస్తి పన్ను వసూళ్లలో కర్నూలుకు రెండో ర్యాంకు
- కీలక పాత్ర పోషించిన సిబ్బందికి సన్మానం
- అభినందించిన నగర మేయర్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరాభివృద్ధిలో ప్రజల సహకారం అద్వితీయమని నగర మేయర్ బివై.రామయ్య కొనియాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే కర్నూలు నగర పాలక సంస్థకు రెండో స్థానం దక్కించుకుందన్నారు. ఈ శుభ సందర్భంగా ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని కౌన్సిల్ హాలులో సన్మాన సభ ఏర్పాటు చేశారు. మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, కమిషనర్ భార్గవ్ తేజ హాజరయ్యారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఆర్ఒ జునైద్, ఆర్ఐలు జిఎం.శ్రీకాంత్, అబ్దుల్ వాజిద్, రాజు, మన్సూర్, సాదిక్, ఖలీల్, సుహైల్, వివిధ సచివాలయాల అడ్మిషన్లు, అమినిటీస్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం మేయర్ రామయ్య మాట్లాడారు. నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నందుకే సకాలంలో పన్నులు చెల్లించి, ఎప్పుడూ మర్చిపోలేని అద్భుతమైన తోడ్పాటును ప్రజలు అందించారన్నారు. ఇందుకు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ నగర ప్రగతికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పడుతున్న శ్రమను ప్రజలు గుర్తించి సహకరిస్తున్నారని, ఇందుకు సాక్ష్యంగా పన్నుల వసూళ్లను చూస్తుంటే తేటతెల్లం అవుతుందన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నగర పాలక సంస్థకు రెవెన్యూ గుండె లాంటిదని చెప్పవచ్చన్నారు. నగరాభివృద్ధిని మరింత చేయాలనే ఉద్దేశ్యంతో ప్రజలు పన్నులు చెల్లించి ఉంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అవినీతిరహితంగా నగరాభివృద్ధి చేద్దామని అన్నారు. కమిషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ నగర పాలక సంస్థలో విభాగాల్లో పోటీ నెలకొందని, ఫలితంగా పనితీరు మెరుగుపడి అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో రాష్ట్రంలో కర్నూలు 2వ ర్యాంకు సాధించగా, తాజాగా రెవెన్యూలో కూడా 2వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించడంలో సిబ్బంది సఫలం అయ్యారన్నారు. వారందరిని అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, చీఫ్ విప్ సత్య నారాయణమ్మ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

- దేశాయి తండాలో తీవ్రమైన తాగునీటి సమస్య
- సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం పరిధిలోని దేశాయి తండాలో నెలకొన్న మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున ఖాళీ బిందెలతో రోడ్డును బైటాయించి ధర్నా చేశారు. వారికీ మద్దత్తుగా సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు సంఘీభావం తెలిపారు. దీంతో కొంతసేపు గుత్తి-పత్తికొండ రోడ్డు రాకపోకలకు అంతరాయము ఏర్పడింది. సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన దేశాయితండాలో తాగు నీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా వారు పట్టించుకోలేదన్నారు. కేవలం కంటి తుడుపు చర్యగా మంచి నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేసి మరల ఎత్తేశారన్నారు. జొన్నగిరి సచివాలయం లో కూడా పలు సార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించు కోలేదన్నారు. ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రం గ్రామాలలో నీటి సమస్య లేకుండా చూడాలని ఒక పక్క చెబుతున్నప్పటికీ ఇక్కడ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గత మూడు నెలలు గ్రామంలో మంచినీటి సమస్యను అరికట్టలేని అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమస్యను పరిష్కారం చేయక పోతే దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు గాజుల గిరిదేవి, చల్లా సరోజ, దూదేకొండ రంగమ్మ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు

సమావేశానికి రారు.. సమస్యలు పరిష్కరించరు..

- బాధ్యత మరిచిన ప్రజాప్రతినిధులు, అధికారులు- తీరు మారని స్థాయి సంఘ సమావేశాలు

నంద్యాల సోషల్ వెల్ఫేర్ డిడికి షోకాజ్ నోటీస్ జారీ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ప్రజాసమస్యలు వేదికగా ప్రతి రెండు నెలకు ఒకసారి నిర్వహించే స్థాయి సంఘం సమావేశాలకు ప్రజాప్రతినిధులు అధికారులు గైహాజరు కావడం పరిపాటిగా మారింది. సమావేశాలు సమయం పది రోజుల ముందు తెలిపినా సమావేశాలకు హాజరు కాకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వం ఏర్పాటయి నాలుగేళ్లయినా పూర్తి స్థాయిలో పనులు జరగలేదని, పూర్తి స్థాయిలో ప్రజాప్రతినిధులు హాజరు కాలేదని మిగిలిన ఒక్క ఏడాదిలో ఎంత అభివృద్ధి జరుగుతుందని జడ్‌పిటిసిలు విమర్శించారు. మంగళవారం జిల్లా పరిషత్ మినీహాల్‌లో స్థాయి సంఘం సమావేశం వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్ అధ్యక్షతన సిఇఒ నాసర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘీక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి శిశు సంక్షేమం,ఆర్థిక ప్రణాళిక, పనులపై సమావేశాన్ని నిర్వహించారు. 2,3,6 సమావేశాల్లో కోరం లేకుండానే నిర్వహించారు. ఇద్దరు ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలో పాణ్యం ఎమ్మెల్యేకాటసాని రాంభూపాల్ రెడ్డి మినహా ఎవ్వరు కూడా హాజరు కావడం లేదు. కొడుమురు జడ్‌పిటిసిలు మాట్లాడుతూ వెల్దుర్తి కోడుమురు రోడ్ టెండర్ జరిగి 3 సంవత్సరాలు గడిచినా నేటికీ పని ప్రారంభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రోడ్ కాంట్రాక్టర్ ఎవరని వివరణ కోరగా పులివెందులకు చెందిన వ్యక్తి అనడంతోనే అందరూ మిన్నకుండి పోవడం కొసమెరుపు. గడివేముల జడ్‌పిటిసి మాట్లాడుతూ వస్తున్నాం టీ, బిస్కెట్, సమోసా తింటున్నాం వెళ్తున్నాం. ఎలాంటి సమస్యలు పరిస్కారం మాత్రం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం, హార్టికల్చర్, ఆగ్రోస్, లాంటి ఖరీఫ్‌కు సంబంధించిన సమస్యలపై చర్చించాల్సిన సమావేశంలో అధికారులు హాజరు కాకపోవడంతో చర్చించకుండానే సమావేశం ముగించారు. సమావేశానికి గైర్హాజరయిన నంద్యాల సోషల్ వెల్ఫేర్ డిడికి షోకాజ్ నోటీస్‌ను జారీ చేయాలని సిఇఒ నాసర రెడ్డి తెలిపారు. సమావేశానికి పూర్తి స్థాయిలో హాజరు కానటువంటి అధికారులపై సిఇఒ అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బారెడ్డి, చైర్మన్ సిసిఅశ్విని కుమార్, ఎఒ జితేంద్ర, జడ్‌పిటిసిలు,అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో కోర్ డీన్ లింగేశ్వర్‌రెడ్డి , అధ్యాపకులు

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలుకలెక్టరేట్

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలలో కర్నూలు నారాయణ విద్యార్థులు ఎంపిసి , బైపిసి విభాగాల్లో అత్యధిక మార్కులను కైవసం చేసుకున్నారని కర్నూలు నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ పి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. విద్యార్థులను, తల్లిదండ్రులను , అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. అనంతరం ఫలితాలను వివరించారు. జూనియర్ ఎంపిసి విభాగంలో ఎ. వెంకట హ్రిషిత 466 మార్కులు, జి. సమీర 466 , ఎ.నఇర 466 , అలాగే 466 మార్కుల పైన ముగ్గురు విద్యార్థులు, 465 పైన 15 మంది విద్యార్థులు, 464 మార్కుల పైన 38 మంది విద్యార్థులు, 460 పైన 130 మంది విద్యార్థులు, 450 పైన 443 మంది విద్యార్థులు, 440 పైన 669 మంది విద్యార్థులు, 400 మార్కుల పైన 1415 మంది విద్యార్థులు సాధించారు.జూనియర్ బైపిసి విభాగంలో జె. మధుల 435 మార్కులు, ఎమ్.అఫిఫ తాయబ్బా 435 మార్కులు, ఎస్.హర్షిత 435 మార్కులు. అలాగే 435 మార్కుల పైన ముగ్గురు , 433 పైన 12 మంది, 430 పైన 25 మంది, 420 పైన 87 మంది, 400 మార్కుల పైన 225 మంది విద్యా ర్థులు సాధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్లు విశ్వనాథ్ రెడ్డి, కె.అంజనేయ రెడ్డి, కె. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్స్ వేణుగోపాల్ రెడ్డి, విజయమోహన్, సుజాత, హవీల , కృష్ణారెడ్డి , దేవెందర్, ఖైరున్నిసా, సాంబశివ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సూర్య కుమారి, జయరామిరెడ్డి, అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యుల తీరు మారాలి : ఎంపిపి

ప్రజాశక్తి- సి బెళగల్ : మండలంలోని పోలకల్, సి బెళగల్ గ్రామాల్లో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యుల తీరు మారాలని ఎంపిపి బొంతల మునెప్ప అన్నారు. మంగళవారం సర్వసభ్య సమావేశంలో ప్రత్యేకించి ఆస్పత్రులపై చర్చ జరిపారు. నలుగురు వైద్యులున్నా వేళలు పాటించడం లేదని, విధుల పట్ల శ్రద్ధ లేదని వాపోయారు. సామాన్యులకు ప్రభుత్వ వైద్యం సక్రమంగా అందేలా తగు దృష్టి సారించాలని అలసత్వం వహిస్తే ఉన్నత వైద్యాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఆయా శాఖధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సి బెళగల్ తహశీల్దార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-సి బెళగల్ : సి బెళగల్ మండల తహశీల్దార్‌గా శేషఫణి మంగళవారం ఆర్ ఇ సౌమ్య సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. సమిష్టి భావంతో పని చేస్తామని రెవిన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే సిబ్బంది బాధ్యతల పట్ల శ్రద్ధ వహించాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేరాల నియంత్రణకు కృషి పెంచాలి

- కేసుల వివరాలను సిసిటిఎన్ఎస్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలి
- పెండి కేసులు తగ్గించి -రాత్రి గస్తీని పెంచాలి
- నేర సమీక్షలో ఎస్‌పి జి.కష్ణకాంత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలో పోలీసులు నేర నియంత్రణకు పకడ్బందీగా కృషి చేయాలని జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ సూచించారు. మంగళవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో ఎస్‌పి జి.కృష్ణకాంత్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా ఎస్‌పిగా భాద్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి నేర సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు , పత్తికొండ , ఆదోని సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి జిల్లా ఎస్‌పి ఆరా తీశారు. దొంగతనాలు జరగకుండా రాత్రి గస్తీని పెంచాలన్నారు. పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యహరించాలన్నారు. కేసులకు సంబంధించిన డాక్యుమెంట్స్, రిపోర్ట్స్, మెడికల్ సర్టిఫికెట్స్ త్వరగా తెప్పించి ప్రతి అధికారి ఛాలెంజ్ గా తీసుకొని కేసులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదయ్యే కేసులను ఎఫ్ఐఆర్ నమోదు దగ్గర నుంచి ఫైనల్ ఛార్జిషీట్ వరకు సిసిటిఎన్ఎస్‌అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాలకు వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. శిక్షల శాతం పెంచి బాధితులకు న్యాయం జరిగేలా చేయాలన్నారు. నిజాయితీగా వ్యవహరించాలన్నారు. ముఖ్యమంత్రి బందోబస్తు, యువగళం బందోబస్తు, అక్రమ మద్యం రవాణా చేస్తున్న నిందితుల అరెస్టులు, మొబైల్ రికవరీ మేళా, 2 నెలల కాలంలో జిల్లా పోలీసులు చేసిన వివిధ కార్యక్రమాలలో ప్రతిభ కనబరచిన పోలీసులను ఎస్‌పి అభినందించారు. మొత్తం 61 మంది పోలీసులకు ప్రశంసా పత్రాలు, జిఎస్ఇలు, నగదు రివార్డులు అందజేశారు. ఐదుగురు డిఎస్‌పిలు, 22 మంది సిఐలు, 10మంది ఎస్ఐలు, 24 మంది పోలీసు కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. డిఎస్పీలలో విజయ శేఖర్, శివనారాయణస్వామి, శ్రీనివాసులు, యుగంధర్ బాబు, నాగభూషణం ఉన్నారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ టి.సర్కార్ , లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి జి.కష్ణకాంత్

చిరువ్యాపారుల బంకులను తొలగించొద్దు

మేయర్‌కు చిరువ్యాపారుల సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రోడ్ సైడ్ చిన్న వ్యాపారుల సంఘం న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బిర్లా గేట్ నుండి శంకరాస్ డిగ్రీ కాలేజీ వరకు గత 30 సంవత్సరాలుగా చిన్న బంకులు వేసుకుని వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారుల బంకులు తొలగించ వద్దని కోరుతూ కర్నూలు మేయర్ బివై.రామయ్యకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, చిన్న వ్యాపారస్తుల సంఘం న్యూ సిటీ కార్యదర్శి మహ్మద్ రఫీ , ఆటో యూనియన్ నగర కార్యదర్శి బి.రాధాకృష్ణ, నగర అధ్యక్షులు వలి, మాలిక్ భాషా, చిరు వ్యాపారులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆర్.నరసింహులు, బి.రాధాకష్ణ , మహమ్మద్ రఫీలు మేయర్‌కు సమస్యను వివరించారు. బిర్లా గేట్ నుండి శంకరాస్ డిగ్రీ కాలేజీ వరకు గత 30 సంవత్సరాలుగా చిన్న బంకులు వేసుకొని ఎవరికీ ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇక్కడ వ్యాపారం చేసుకునే వారందరూ కూడా పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీలకు చెందిన వారే ఉన్నారన్నారు. చదువుకున్న చదువులకుతగ్గ ఉద్యోగాలు రాక ప్రభుత్వంపై ఆధారపడకుండా చిన్న మొత్తంలో పెట్టుబడిపెట్టి వ్యాపారం చేసుకుంటూ వచ్చిన ఆదాయంతో జీవనం కొనసాగిస్తున్నారు. కుటుంబాలను పోషించుకుంటూ, పిల్లలను చదివించుకుంటూ ఇంటి అద్దెలు చెల్లిస్తూ వ్యాపారం కొరకు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ నిరంతరం కష్టాలను అనుభవిస్తున్న వారిని ఆదుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ చిరు వ్యాపారులషాపులు తొలగించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మేయర్ స్పందిస్తూ బంకులు వేసుకుని తమ కుటుంబాలను పోషించుకుంటున్న ఈ చిరు వ్యాపారులకు ఎటువంటి హాని కలగకుండా బంకులను తొలగించకుండగా మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారు. బిసిహెచ్.మల్లయ్య, ఎం.మహబూబ్ బాషా, యు.శ్రీనివాసులు, అబ్దుల్ అజీజ్, ఇమ్రాన్, పి.ఆలీబాబా, మణికంఠ, నరసయ్య, ఎస్.హుస్సేన్ వలి, బి.మల్లికార్జున, అఫ్రోజ్, కె.శివ తదితరులు పాల్గొన్నారు.


మేయర్‌కు వినతిని ఇస్తున్న చిరువ్యాపారుల సంఘం నేతలు

పి.దాక్షాయిని-470

ఎం.సాయితేజస్విని-466,

వై.భవిత -466

ఇంటర్ సప్లిమెంటరీలో శ్రీ చైతన్య విద్యార్థుల హవా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నేడు విడుదలైన ఇంటర్ ప్రథమ , ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని శ్రీ చైతన్య కళాశాళల ఎజిఎమ్. మురళీకృష్ణ తెలిపారు. జూనియర్ విభాగంలోఎంపిసిలో మా విద్యార్థిని పి. దాక్షాయని 470 మార్కులకు గాను 466 మార్కులు, ఎమ్. సాయి తేజస్విని 466 , వై. భవిత 466 , ఎ.సింధు 465, టి.నేహ 465 మార్కులు, ఆర్. సుమన్ 465 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ బైపిసి. విభాగంలో జి. ఉమ్మెహనీ 440 మార్కులకు గాను 435 మార్కులు, కె.ఉష 435 , ఎ.నాగ భవ్య 435.,మార్కులతో కర్నూలు జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించారన్నారు. ఈ ఫలితాలు కేవలం శ్రీ చైతన్య కర్నూలు లో సాధించిన ఫలితాలు మాత్రమే అని వేరే ఏ ఇతర శాఖల నుండి కాదని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను అభినందిస్తూ కళాశాల డీన్ బాలాజీ ,సరళ తెలిపారు. ఇంకా జూనియర్ ఎంపిసిలో 465 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఏడుగురు, 464 ఆ పైన సాధించిన విద్యార్థులు12, 463 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు15 , 462 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 24, 461 ఆ పైన సాధించిన 46, 460 ఆ పైన 65 సాదించారన్నారు. జూనియర్ బైపిసి విభాగంలో 435 ఆ పైన మార్కులు సాధించిన వారు ముగ్గురు, 434 ఆ పైన విద్యార్థులు ఐదుగురు, 433 ఆ పైన 10 మంది, 430 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 28 ఉన్నారని తెలిపారు.

డాక్టర్ కె వి సుబ్బారెడ్డి పాలిటెక్నిక్‌లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

క్యాంపస్ సెలక్షన్‌లో కెవిసుబ్బారెడ్డి పాలిటెక్నిక్ విద్యార్థులు

డాక్టర్ కె వి సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన సన్‌గ్లేర్ టెక్నాలజీకి చెందిన ప్రాజెక్ట్ మేనేజర్ వివేక్ ఆనంద్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 96 మంది విద్యార్థులు పాల్గొనగా 35 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు సన్‌గ్లేర్ టెక్నాలజీ సంస్థ శిక్షణ ఇచ్చి వారి సంస్థలో ఉద్యోగాలు కల్పిస్తారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ లయన్ డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ ఎస్. విజయ లక్ష్మమ్మ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.కన్నకుమార్, డిప్లమా కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ .విజయకుమార్, టిపిఒనాగేందర్ రెడ్డి, హెచ్‌ఒడి లు ఉద్యాపకబృందం పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ప్రజలకు మెరుగైన వైద్యమందించాలి

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ - ప్రసూతి ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వైద్యులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రసూతి ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా హాస్పిటల్‌లోని రిసెప్షన్‌లో రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. విధులకు పూర్తిస్థాయి సిబ్బంది హాజరయ్యారా అని వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా గర్భిణులకు ప్రతినెలా జరిగే స్కానింగ్ కార్యక్రమంలో ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తాగునీరు, కుర్చీలు, ఫ్యాన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు హాస్పిటల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిర్మాణంలో ఉన్న హాస్పిటల్ అదనపు గదుల పనుల పురోగతిపై పరిశీలించారు. నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకు రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి లత, ఎపిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివరాం రెడ్డి, ఆదోని తహశీల్దార్ వెంకట లక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘం నూతన

వ్యాపార సముదాయం ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

గోనెగండ్లలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన వ్యాపార సముదాయాన్ని ప్రారంభించారు. మంగళవారం జిల్లా సహకార బ్యాంకు ఛైర్మన్ మహాలక్ష్మీ, వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డిలు శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రూ.11 లక్షలతో నిర్మించిన ఈ వ్యాపార సముదాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దీని నుంచి వచ్చే ఆదాయంతో సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. అలాగే రూ.2 కోట్లతో ప్రారంభించిన సహకార సంఘం టర్నోవర్ నేడు రూ.12 కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమన్నారు. రైతులు కూడా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సిఇఒ రామాంజనేయులు, డిసిఒ ఎన్.రామాంజనేయులు, ఐసిడిఎస్ సిఇఒ వెంకటకృష్ణ, ఆప్కాబ్ సిఇఒ విజయ్ కుమార్, కోడుమూరు మేనేజర్ వెంకటరమణ, సూపర్‌వైజర్ విష్ణువర్ధన్, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ మన్సూర్, గోనెగండ్ల సింగిల్‌విండో ప్రెసిడెంట్ కాశీరెడ్డి, సిఇఒ చంద్రశేఖర్, సిబ్బంది మునిస్వామి, లక్ష్మన్న పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎంపిడిఒ సుబ్బరాజు

ప్రజాశక్తి - కౌతాళం

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపిడిఒ సుబ్బరాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కామవరం, ఉరుకుంద గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, సచివాలయ బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు. వైఎస్ఆర్ బీమా ఎన్‌రోల్‌మెంట్, వివిధ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై వివరాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా తెలుసుకున్నారు. ఉరుకుంద గ్రామ పంచాయతీలోని అంగన్వాడీ-1 కేంద్రాన్ని తనిఖీ చేసి, ఆయాతో మెనూ ప్రకారం భోజన పదార్థాల అందిచారా అని అడిగి తెలుసుకున్నారు. సర్పంచి వసంత్, పంచాయతీ కార్యదర్శులు శివప్ప, శ్రీరాములు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం : ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ సుబ్బరాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది అందరూ క్రమం తప్పకుండా వేళకు బయో మెట్రిక్ అటెండెన్స్‌ను వేయాలని ఆదేశించారు. మండల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు.

అమ్మో..! జూన్...

- **గుబేల్‌మంటున్న తల్లిదండ్రుల గుండె**
- **ఇప్పట్నుంచే అప్పల వేట**
- **భారీగా పెరిగిన స్కూల్ ఫీజులు**

జూన్... ఈనెల పేరు చెబితే కొందరికి ఆనందమైతే, మరికొందరికి ఆందోళన. పై తరగతికి వెళ్తామని విద్యార్థులు సంతోషంగా ఉంటారు. వారి తల్లిదండ్రులు మాత్రం ఈ ఏడాది ఇంత ఫీజు ఎలా కట్టాలా అనే ఆవేదనలో ఉన్నారు. ఇదే నెలలో పాఠశాలల్లో డొనేషన్లు, ఫీజులు, పుస్తకాలు, డ్రెస్సులు చాలా వస్తువులను కొను గోలు చేయాల్సి ఉంటుంది. వారం ముందు నుంచే విద్యార్థులు గుర్తు చేస్తుండడంతో 'అమ్మో..! జూన్' వచ్చేసిందా అనుకుంటూనే అప్పల వేటలో పడ్డారు.

ప్రజాశక్తి-ఆదోనిరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఫీజు ఉండదు. ప్రభుత్వమే పుస్తకాలను ఉచితంగా అందిస్తోంది. దీనికితోడు రెండు జతల ఏకరూప దుస్తులనూ ఇస్తోంది. ప్రయివేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు డొనేషన్లు, భారీగా ఫీజులతో పాటు పుస్తకాలు, డ్రెస్సులు, నోట్ పుస్తకాలు ఇలా అన్నీ బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాలి. ప్రయివేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల దోపిడీ కొనసాగుతోంది. త్వరలో 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో పుస్తకాలు, స్టేషనరీతో పాటు స్కూళ్ల యూనిఫారాలు తీసుకెళ్లాలని సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులకు వాట్సాప్ సందేశాలు పంపిస్తున్నాయి. వ్యాపారంలో సింహభాగం వాటా ఉన్న శ్రీచైతన్య, నారాయణ పాఠశాలలు ప్రస్తుతం అనుకూల పరిస్థితులుండడంతో 30-40 శాతం మేర ఫీజులు పెంచి వసూళ్లు చేస్తున్నాయి. కరోనా సమయంలో అంటే గత రెండేళ్లలో భారీగా నష్టపోయిన నష్టాన్ని పూడ్చుకునేందుకు ప్రయివేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి. ఇది సామాన్య, మధ్య తరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇప్పుడిప్పుడే పరిస్థితులు కుదుటపతున్నాయనుకుంటే జూన్ మాసం కాళ్లకు బంధం వేస్తోంది. ఎంత కష్టం వచ్చినా ప్రస్తుతం తప్పించుకునే పరిస్థితులు ఎంతమాత్రం కనిపించడం లేదు. అప్పులు చేసైనా ఈ గండం నుంచి గట్టెక్కేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యాసంస్థలు త్వరలో ప్రారంభం కానుండడంతో పిల్లల చదువుల కోసం పైసా పైసా కూడబెట్టుకున్న డబ్బులు ఒక్కసారిగా కరిగిపోయే కాలం ఆసన్నమైంది. ఫీజులతో పాటు పుస్తకాలు, బ్యాగులు అన్నీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

డొనేషన్ వసూళ్లు : పట్టణంలో దాదాపు 100 వరకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఉన్న స్కూళ్లలో డొనేషన్ల దోపిడీ కొనసాగుతోంది. ముందుగా అప్లికేషన్ ఫారం నింపాలి. దాని ఖరీదు రూ.500 నుంచి రూ.5 వేలకు పైగా ఉంటుంది. ఇక సీటు కోసం మాట్లాడాలంటే ముందుగా డొనేషన్ చెల్లించాలి. అదీ రూ.10 వేల నుంచి రూ.లక్షల్లో కట్టేందుకు సిద్ధపడితే అక్కడ సీటు ఉంటుంది. ఇంటర్నేషనల్, కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థ అయితే కనీసం రూ.10 లక్షలకు తక్కువగా డొనేషన్లు ఉండవు. వీటన్నింటికీ కొత్త పేర్లతో యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ఇక ట్యూషన్ ఫీజు. ఎంత చిన్న ప్రయివేట్ పాఠశాల అయినా కనీసం రూ.20 వేల నుంచి తరగతిని బట్టి రూ.లక్షల్లో వసూలు చేస్తారు. ఇక సీటు లభించిన తర్వాత అడ్మిషన్ ఫీజు, స్పోర్ట్స్, స్పెషల్, కల్చరల్ ఫీజు ఇలా అనేక రకాల ఫీజులను యాజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నాయి.

నిలువు దోపిడీ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఫీజు ఉండదు. ప్రభుత్వమే పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. దూర ప్రయాణమైతే ప్రభుత్వం ట్రావెలింగ్ అలవెన్స్ కూడా అందిస్తోంది. రెండు జతల ఏకరూప దుస్తులను ఇస్తోంది. ప్రయివేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లోనే విద్యార్థులకు డొనేషన్లు, భారీగా ఫీజులతో పాటు పుస్తకాలు, డ్రెస్సులు, నోట్ పుస్తకాలు ఇలా అన్నీ బయట మార్కెట్‌లో కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది.

30-40 శాతం మేర ఫీజుల పెంపు : పట్టణ పరిధిలో అధికంగా తిష్ట వేసిన శ్రీచైతన్య, నారాయణ పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యాసంస్థల్లో 30-40 శాతం మేర

ఫీజులను పెంచి వసూళ్లకు పాల్పడుతున్నాయి. త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఫీజులు చెల్లించాలని, రాయితీలు ఇస్తామని ప్రకటించడంతో పాటు పుస్తకాలు, యూనిఫారం, స్టేషనరీ కొనుగోలు చేయాలని ఇబ్బందుకు గురి చేస్తున్నాయి. పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలనే విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఉన్న కసిని, పట్టుదలను పెట్టుబడిగా భావించి మాఫియా వసూళ్లకు పాల్పడుతుండడం గమనార్హం.

అధిక ఫీజులను నియంత్రించాలి : శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ

ప్రభుత్వం ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ పాఠాలు బోధిస్తామంటూనే మరోవైపు ప్రయివేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలను పర్యవేక్షించడం లేదు. ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు రూ.లక్షల్లో దోచుకుంటున్న కార్పొరేట్ మాఫియాపై కనీసం నియంత్రణ విధానాన్ని ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు పర్చడం లేదు. ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణపై కొత్త చట్టం తీసుకురాబోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించినా, కార్యరూపం దాల్చడం లేదు. ఇలా కాలయాపనతో ప్రభుత్వం ప్రయివేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్ల యాజమాన్యాలకు లోపాయికారి ఒప్పందాలతో కాలం వెళ్లదీయడం ఎంత వరకు సమంజసం. ప్రభుత్వం స్పందించి అధిక ఫీజులను నియంత్రించాలి.

బాధిత కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా ఆసరా

- ఎమ్మెల్యే చేతులమీదుగా నగదు పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం

బాధిత కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన షేక్ గౌస్ మోదీన్ గతనెల 28న అనారోగ్యంతో బాధపడుతూ కర్ణాటక రాష్ట్రం రాయచూరులో చికిత్స పొందుతూ మృతి చెందారు. తక్షణ సహాయం కింద అదే రోజు అంత్యక్రియల కోసం రూ.10 వేల నగదును అందజేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన వైఎస్ఆర్ బీమా నగదు రూ.లక్షను నామిని అయిన మృతుని భార్య ఖాజా భానుకు మంగళవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాధిత కుటుంబం ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బీమా నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

బాధితునికి ప్రదీప్ రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - మంత్రాలయం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుని వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి పరామర్శించారు. తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దకడబూరు మండలం హానుమాపురం గ్రామానికి చెందిన ఈరన్న గాయపడ్డారు. గాయపడిన ఆయనను వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ప్రదీప్‌రెడ్డి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కర్నూలులోని ఆస్పత్రికి మంగళవారం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పిఎ వెంకట్రామి రెడ్డి, సర్పంచి పూజారి ఈరన్న, వైస్ సర్పంచి రఘు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రదీప్‌రెడ్డి

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివణం కన్నడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మూకప్ప, సర్పంచి రాము, విద్యా కమిటీ ఛైర్మన్ తిప్పన్న ఆధ్వర్యంలో మంగళవారం విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు మెడికల్ నాగరాజు, హనుమంతప్ప, బాలప్ప, సంతోష్, వీరేష్, బలరాం, నాగరాజ్, డీలర్ మారెప్ప పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని పి.కోటకొండ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు మీనుగ కృష్ణ, పెద్ద లింగన్న, రంగడు జగనన్న కానుక కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **హోళగుంద** మండలం ఎల్లార్తి గ్రామం బీసీ కాలనీ ఎంపియుపి కన్నడ పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ప్రధానోపాధ్యాయులు విజయమ్మ, యువ నేత ఎస్‌కె.గిరి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ఛైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు సుచరిత, శరణ బసవ పాల్గొన్నారు.

ఆదోనిలో కిట్లను అందజేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

దేవనకొండలో కిట్లను పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

హోళగుందలో కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మంత్రాలయం మండలం సూగూరు గ్రామం పొలానికి వెళ్తున్న సమయంలో దళితుడిపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కెవిపిఎస్ నాయకులు సుమాల ఆంతోని, గుంటప్ప, చర్మ కార్మికుల సంఘం నాయకులు భాస్కర్ మాట్లాడారు. నిందితులను అరెస్టు చేయకపోతే ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున గ్రామాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామ కమిటీ సభ్యులు ఈరన్న, మండల వైస్ ప్రెసిడెంట్ రాజా రమేష్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించి బస్సులు నడపాలి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ప్రజలు, ప్రయాణికుల కోరిక మేరకు సమయపాలన పాటించి బస్సులు నడపాలని ప్రయాణికులు ఎమ్మిగనూరు బస్సు డిపో అధికారులను కోరుతున్నారు. గతంలో ఎమ్మిగనూరు నుంచి మాలపల్లి, డి.బెళగల్ మీదుగా కోసిగి, ఉరుకుందకు రాత్రి సర్వీసును నడిపేవారు. ఈ బస్సు ఎమ్మిగనూరు బస్సు డిపోలో రాత్రి 8.30 గంటలకు బయల్దేరేది. ప్రస్తుతం ఆ బస్సును ఎమ్మిగనూరు నుంచి కోసిగికి అదనపు సర్వీసు నడపడంతో తిరిగి రాత్రి 10 గంటలకు ఎమ్మిగనూరుకు వచ్చి బయల్దేరడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు, ఆస్పత్రులకు వెళ్లిన మండల ప్రజలకు 8.30 గంటలకు ఎమ్మిగనూరు డిపో నుంచి బస్సు నడిపితే ఉపయోగంగా ఉంటుంది. అలాగే ఆదోని నుంచి వచ్చే ఆర్లబండ, ఐరనగల్ బస్సులకు కోసిగి నుంచి దుద్ది, కొలమాన్ పేట, సజ్జలగూడెం, ఐరనగల్, జంపాపురం, తదితర గ్రామాలకు వెళ్లే వారికి ఆ సమయానికి బస్సు నడిపితే రాత్రి గ్రామాలకు వెళ్లేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం ఒక సర్వీస్ కోసిగికి నడపడంతో అదే బస్సు రాత్రి 10.30 గంటలకు బయల్దేరుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- తిక్కారెడ్డికి వైసిపి సవాల్

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండలంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి టిడిపి నాయకులు తిక్కారెడ్డి, రమాకాంత్ రెడ్డికి సవాల్ విసిరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి తన అనుచరులతో కలిసి పెద్దకడబూరు గ్రామ శివారులోని జగనన్న కాలనీలోని వసతులపై సెల్ఫీలతో ఆరోపణలు చేశారని తెలిపారు. 2014-19 మధ్య కాలంలో అధికారంలో ఉన్న తిక్కారెడ్డి కానీ, రమాకాంత్ రెడ్డి కానీ మండలంలోని పేదలకు ఒక్క పట్టా అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. జగనన్న కాలనీలోని ఇళ్ల పట్టాలపై, అక్కడి వసతులపై మాట్లాడే అర్హత లేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో మండల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని వివరించారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీవీ

బంగారప్ప మృతికి బీవీ సంతాపం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణానికి చెందిన నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షులు దేవమ్మ భర్త బంగారప్ప ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం పట్టణంలోని 34వ వార్డులో గల వారి స్వగృహానికి వెళ్లి బంగారప్ప చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవమ్మను ఓదార్చి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి తరపున అండగా ఉంటామని తెలిపారు.

పాముకాటుతో బాలుడు మృతి

ఆలూరు : పట్టణంలో పాముకాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బంధువుల వివరాల మేరకు... కెడిసిసి బ్యాంకు పక్కన నివసిస్తున్న రామాంజినమ్మ, ఉరుకుందుల పెద్దకుమారుడు ధర్మతేజ్ (10) గత శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాముకాటు వేసింది. అస్వస్థతకు గురైన ధర్మతేజ్‌ను బళ్లారి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు.

రైతులకు ఏ సమస్య రాకుండా చూడడమే లక్ష్యం

- ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులకు ఏ సమస్య రాకుండా చూసుకోవాలన్నదే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. గత వారంలో దౌల్తాపురం గ్రామంలో మేకల కోదండకు చెందిన రెండు వృషభాలు పాముకాటు వల్ల మృతి చెందాయి. మంగళవారం గుమ్మనూరు గ్రామంలో బాధిత రైతు ఇంటి దగ్గర కలిశారు. బాధిత రైతును ఆదుకోవాలని పశు వైద్యాధికారులతో మాట్లాడి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానని, తనవంతు సహాయం అందజేస్తానని రైతుకు భరోసా కల్పిస్తూ రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొద్దు పొడిస్తే వృషభాల దగ్గరకు వెళ్లే ఏ రైతుకైనా అలా జరిగితే ఎంత బాధ పడతారో తమకు తెలుసన్నారు. రైతు కన్నీళ్లు పెట్టకూడదని, ఉన్నదాంట్లో ఏ ఒక్క రైతునైనా ఆదుకోవడం మనిషి నైజమన్నారు. శ్రీధర్, షేకన్న, వాలంటీరు తిమ్మప్ప, నెట్టికంటి, అంజి, కొండ సుంకన్న, రాజశేఖర్, పెద్ద నెట్టికంటి పాల్గొన్నారు.

రైతుకు ఆర్థికసాయం అందిస్తున్న గుమ్మనూరు నారాయణ

'పార్కుల అభివృద్ధికి చర్యలు'

ఆదోని : పట్టణంలో మున్సిపల్ పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ పార్కులోని ప్లాంటేషన్‌ను పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని మహావీర్ పార్కు, ఇంద్ర నగర్, రాంజల చిల్డ్రన్స్ పార్కు, నేషనల్ స్కూల్ పార్కు, ఎన్‌జిఒస్ కాలనీ పార్కు, ఎస్‌కెడి కాలనీ పార్కుల్లో కనీస సదుపాయాలు కల్పిస్తామన్నారు. మొక్కలు పెంచి పచ్చదనం పెంపొందించి ఆహ్లాదకరంగా మారుస్తున్నామన్నా రు. వాకింగ్, జాగింగ్ చేసేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు రూ.5 లక్షలతో ఒక్కో పార్కును అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

పార్కులోని ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై పెనుభారం : సిపిఎం

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు పెంచుతుండడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం పడిందని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, మండల నాయకులు సూరి సంజన, యూసుఫ్ బాష పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడారు. నాలుగేళ్ల పాలనలో విద్యుత్ బిల్లులను ఎడాపెడా పెంచడంతో పేదలపై అదనపు భారం పడిందన్నారు. పేదలకు ఓ వైపు సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరోవైపు విద్యుత్, బస్సు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇంటి పన్నుల పేరిట వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలపై పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

కంటి ఆపరేషన్లు విజయవంతం

ఆదోని : ఆదోనిలో 12న అవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరంలో ఎంపికైన వారికి కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రిలో నిర్వహించిన ఆపరేషన్లు విజయవంతమైనట్లు అవోపా అధ్యక్షులు శ్రీనాథ్ గుప్త, దాత నరేష్ కాకుబాళ్ తెలిపారు. ఆదోనికి వచ్చిన రోగులను మంగళవారం కలిసి వారు పరామర్శించారు. పేదల కళ్లల్లో వెలుగు నింపడం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. అవోపా ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్న శెట్టి, రంగనాయకులు, కార్యదర్శి మిరియాల శ్రీధర్, సంగీత, మమతశ్రీ, హిమబిందు, గీత పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న శాంతి కుమార్

దేవనకొండ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌కు శాంతికుమార్ వినతి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, వైసిపి మండల యూత్ నాయకులు కాకర్ల శాంతి కుమార్ కోరారు. మంగళవారం కర్నూలు నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోనే వెనుకబడిన మండలమని, గతంలో ఫ్యాక్షన్ కోరల్లో చిక్కుకుని అభివృద్ధిలో వెనుకబడి ఉందని తెలిపారు. హంద్రీనీవా ద్వారా 46 వేల ఎకరాలకు సాగునీరందేలా ఉన్నప్పటికీ పెండింగ్ కాలువలు పూర్తి కాకపోవడంతో అన్ని ప్రాంతాలకు సాగునీరు అందడం లేదన్నారు. నేషనల్ బ్యాంకు ఏర్పాటు కాకపోవడంతో రైతులు, వ్యాపారులు, యువత ఇబ్బంది పడుతున్నారన్నారు. డిఎన్‌టి హాస్టల్‌కు సొంత భవనాలు లేకపోవడంతో వసతి గృహం మూతపడిందని తెలిపారు. విద్యార్థులకు క్రీడా మైదానం లేక క్రీడల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ఆదర్శ పాఠశాల లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పారు. మండలంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు అందుకున్న శాంతిరాజు

ప్రజాశక్తి - ఆదోని

ప్రశంసాపత్రం అందుకుంటున్న శాంతిరాజు

ఆదోని సబ్ డివిజన్‌లో ఫ్యాక్షన్ కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ అడ్డుకట్టకు తోడ్పాటు నందించిన హెడ్ కానిస్టేబుల్ శాంతిరాజుకు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు ప్రదానం చేశారు. మంగళవారం కర్నూలు నగరంలో జరిగిన క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో ఎస్పీ కృష్ణకాంత్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. అనుమానితులు, ఫ్యాక్షనిస్టుల కదలికలపై నిఘా పెంచాలని, అనుమానం కలిగితే ఆ ఏరియా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారని తెలిపారు. మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానని శాంతిరాజు తెలిపారు.

In the Court of the Special Mobile Magistrate : KURNOOL
O.S.No. 74/2023
B. Shiva Kumar gupta .... Plaintiff
V/s.
M/s. Parimala Agencies Rep. by
1) B. Sarath babu S/o. NOT KNOWN, 44ys, Hindu, Business, Shop No. 3, Mayuri Heights, Kurnool.
2) Attulur. VIJAY Kumar S/o. Rama swamy, 40ys, Hindu, business, H.No.56-10F, Kondaiah gate, Kurnool.
3) Attulur. VINAY KUMAR S/o Rama swamy, 38ys, Hindu business, H.No.51-14-7A, Bellary road, Kurnool.
.... Defendants
SUMMONS TO DEFENDANTS
వాది తన ప్రాంసరు బాకీ రాబట్టుకొనుటకు మీ పై పై కోర్టులో దావా దాఖలు చేసియున్నాడు. మీకు ఎలాంటి ఆక్షేపణలు వున్నచో పై కోర్టు ఎదుట 30-6-2023 వ తేదీన హాజరై తెలుపుకొనేది. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.
వాయిదా తేది : 30-06-2023
(ORDER OF THE COURT)
T. ESWAR BABU,
Advocate for Plaintiff
A.P. Bar Council No. 1061/1985
Kurnool Cell: 94402 91045

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS /ARBITARATOR : : KURNOOL.
DISPUTE NO ARC/KNL/309/2021
M/S. Mahok Chit Funds (Pvt) Ltd, Kurnool, Rep. by its Foremen ... DISPUTANT.
-Vs-
M.Jyothi Reddy and 3 others ...OPPONENTS.
NOTCE TO OPPONENTS 1 TO 4
1.M.Jyothi Reddy W/o R.Satya Prakash Reddy, Hindu,aged about 35years, Business, H.No.45/24/R-3A, Sri Nagar Colony, (Near), Ashok Nager, Kurnool.
2.M.Ramesh, S/o M.Papanna,, Hindu, aged about 47 years, Line Inspector,o/o OSD, Atmakur, Kurnool(Dist).
3.M.V.Pratap Raju, S/o M.Muni Raju,Hindu, aged about 55 years, Line Inspector, o/o H.No.17-107-50-1, Akkiraju Colony, Atmakur (po), Kurnnol (Dist).
4.K.Varada Raju S/o K.Kotaiah, Hindu, aged about 55 years, Record Asst, o/o Division Section, A.P.C.P.D.C.L,Kurnool.
పై నెంబర్ దావా లో DISPUNANT వారు వారికి రావలసిన బాకీ మొత్తము, రూ.8,59,875/-,అసలు ఖర్చులు ముందు వడ్డీ రాబట్టుటకు గాను మీ పైన దాఖలు చేసిన Dispuit నందు 1 to 4 వరకు OPPONENTS అయిన మీకు యేమైనా ఆక్షేపణ వున్న 01-07-2023వ తేదీన పగలు గంటలకు 10.30 నిమిషములకు పై కోర్ట్ లో హాజరై తెలుపు కొనవలేయును, లేని యెడల నీ పరోక్షముగా తీర్మానించ బడును.
(కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేది: 01/07/2023
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITARATOR ::KURNOOL

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS /ARBITARATOR : : KURNOOL.
DISPUTE NO ARC/KNL/308/2021
M/S. Mahok Chit Funds (Pvt) Ltd, Kurnool, Rep. by its Foremen ... DISPUTANT.
-Vs-
V. Venkateswarlu and 3 others ...OPPONENTS.
NOTCE TO OPPONENTS 1 TO 4
1.V.Venkateswarlu S/o V.Ramudu, Hindu,aged about 38years, doing business, H.No.51/15/D331A,Rajiv Nagar, (Near), Bellary Chourasta, Kurnool.
2.P.Ratanlal, S/o P.Peddalal, Hindu, aged about 30 years, P.C NO.900, 10 TH BatalianT.S.SPL.police, Gadwal (Dist) Telangana (State).
3.E.Sreenivasulu, S/o E.Sunkanna, Hindu, aged about 47 years, S.G.Teacher, Gospadu (Ma), Kurnool(Dist),
4.Y.Achyutha Rao, S/o Y. Daniel, Hindu, aged about 35 years,Jr.Asst, Z.P.High School, Kothapalli(Ma), Kurnool(Dist).
పై నెంబర్ దావా లో DISPUNANT వారు వారికి రావలసిన బాకీ మొత్తము, రూ.3,98,476/-,అసలు ఖర్చులు ముందు వడ్డీ రాబట్టుటకు గాను మీ పైన దాఖలు చేసిన Dispuit నందు 1 to 4 వరకు OPPONENTS అయిన మీకు యేమైనా ఆక్షేపణ వున్న 01-07-2023వ తేదీన పగలు గంటలకు 10.30 నిమిషములకు పై కోర్ట్ లో హాజరై తెలుపు కొనవలేయును, లేని యెడల నీ పరోక్షముగా తీర్మానించ బడును.
(కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేది: 01/07/2023
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITARATOR ::KURNOOL

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS /ARBITARATOR : : KURNOOL.
DISPUTE NO ARC/KNL/307/2021
M/S. Mahok Chit Funds (Pvt) Ltd, Kurnool, Rep. by its Foremen ... DISPUTANT.
-Vs-
C. Siva Rami Reddy and 3 others ...OPPONENTS.
NOTCE TO OPPONENTS 1 TO 4
1.C.Siva Rami Reddy S/o C.Venkata Reddy, Hindu,aged about 60 years, Flat No.303, Srinivasa Towers, Balaji Nager, Kurnool.
2.MD.Yazaz Basha, S/o Mahaboob Sab, Muslim,aged about 46 years, Working as S.A.Asst,Z.P.High School, Waddepally Ma), Gadwal (Dist),
3.G.Nagi Reddy, S/o G.Anki Reddy, Hindu, aged about 51 years, Working as S.G. Teacher, M.P.P.School, Buzunur(vi), Kurnool (Dist).
4. G.Tulasi Devi, W/o K.Venkata Rami Reddy, Hindu,aged about 45 years, Working as S.G.Teacher, M.P.PSchool,Gudur (Ma), Telangana (state)
పై నెంబర్ దావా లో DISPUNANT వారు వారికి రావలసిన బాకీ మొత్తము, రూ.3,86,874/-,అసలు ఖర్చులు ముందు వడ్డీ రాబట్టుటకు గాను మీ పైన దాఖలు చేసిన Dispuit నందు 1 to 4 వరకు OPPONENTS అయిన మీకు యేమైనా ఆక్షేపణ వున్న 01-07-2023వ తేదీన పగలు గంటలకు 10.30 నిమిషములకు పై కోర్ట్ లో హాజరై తెలుపు కొనవలేయును, లేని యెడల నీ పరోక్షముగా తీర్మానించ బడును.
(కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేది: 01/07/2023
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITARATOR ::KURNOOL

రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

'రెవిన్యూ'లో బదిలీలు..

- 41 మంది అధికారులకు, సిబ్బందికి స్థాన చలనం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రెవెన్యూ శాఖలో బదిలీల ప్రక్రియను చేపడుతూ సిసిఎల్‌ఏ చీఫ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లాలోని ముగ్గురు తహసీల్దార్లను, 13 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 17 మంది మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, 8 మంది జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్ట్‌లను బదిలీ చేస్తూ కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన ఉత్తర్వులు జారీ చేశారు. మిడుతూరు తహశీల్దారు సిరాజుద్దీన్‌ను ఆత్మకూరు ఆర్‌డిఒ ఆఫీస్ డిఎఒగా, బండి ఆత్మకూరు తహసీల్దార్ ఉమారాణిని ఆత్మకూరు తహసీల్దార్‌గా, ఆత్మకూరు తహసీల్దార్ ఎస్.ప్రకాష్ బాబును మిడ్తూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

13 మంది డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ

కొలిమిగుండ్ల డిటి (డిప్యూటీ తహశీల్దారు)గా ఉంటూ జిల్లా జాయింట్ కలెక్టర్ పేసిలో పని చేస్తున్న రాజీవ్ రెడ్డిని ఆళ్లగడ్డకు బదిలీ చేశారు. ఆళ్లగడ్డ డిటిగా ఉంటూ డిప్యూటేషన్‌పై కలెక్టరేట్లో పనిచేస్తున్న వి.గురునాథంను గడివేములకు బదిలీ చేశారు. ఇదే మండలంలో డిటిగా ఉంటూ డిప్యూటేషన్‌పై కలెక్టరేట్లో పని చేస్తున్న డి.సుధాకర్ రావును ఆళ్లగడ్డకు, ఆళ్లగడ్డలో ఎన్నికల విభాగం డిటిగా ఉన్న టి రవీంద్ర ప్రసాద్‌ను రుద్రవరంకు బదిలీ చేస్తూ అదే మండలానికి తహశీల్దారుగా ఫుల్ అడిషనల్ ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. మహానంది డిటి నారాయణరెడ్డిని వెలుగోడుకు బదిలీ చేస్తూ అదే మండలానికి తహశీల్దార్‌గా ఫుల్ అదనపు ఇన్చార్జి బాధ్యతలు ఇచ్చారు. వెలుగోడు డిటి పి.శ్రీని వాసులను మహానందికి, కొత్తపల్లి డిటి జి.మనోహర్‌ను ఆత్మకూరుకు, ఆత్మకూరు డిటి వై.శివ విశ్వ తేజను కొలిమిగుండ్లకు బదిలీ చేశారు. రుద్రవరం డిటి మజ్దూరు హుస్సేన్‌ను నంద్యాల ఆర్డీవో కార్యాలయంకు బదిలీ చేశారు. మిడు తూరు డిటి రవణమ్మను ఆత్మకూరులో ఎన్నికల విభాగంకు బదిలీ చేశారు. శ్రీనివాసులును మిడుతూరు డిటీగా, బేతంచర్ల డిటిగా ఉంటూ డోన్ ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పి.మధును డోన్‌కు బదిలీ చేశారు. డోన్ డిటిగా ఉంటూ బేతంచెర్లలో పని చేస్తున్న సత్యదీప్‌ను అక్కడికే బదిలీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 17 మంది మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లను, సీనియర్ అసిస్టెంట్లను, 8 మంది జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్ట్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అయితే ఈ బదిలీలపై పలు విమర్శలు విని పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు బదిలీ చేయకుండా కేవలం ఒకే జిల్లాలో ఆయా మండలాలకు బదిలీ చేయడంపై అనేకమంది రెవిన్యూ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాలామంది కర్నూలు జిల్లా నుండి కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లాకు అయిష్టంగానే ఇక్కడికి వచ్చారు. అయితే సాధారణ బదిలీల్లో భాగంగా మళ్లీ తమ సొంత ప్రాంతాలకు వెళ్ళవచ్చని అనుకున్న సిబ్బందికి నిరాశే మిగిలింది.

ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలోని కియోస్కి మెషీన్‌ను, మాయిశ్చర్ మీటర్‌ను, ఎరువులు భద్రపరచిన గోడౌన్‌ను కలెక్టర్ పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ రికార్డులను తనిఖీ చేస్తూ అందుబాటులో వున్న ఎరువులు, విత్తనాల స్టాక్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు తమ పరిధిలోని సాగయ్యే విస్తీర్ణానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఇప్పుడిప్పుడే రైతులు పొలాల్లో సేద్యం పనులు మొదలు పెట్టారని, సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ

అనంతరం నంద్యాల పట్టణం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తిక్కస్వామి దర్గా -1 అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరుపట్టిక, పిల్లల బరువు, ఎత్తు రిజిస్టర్, పౌష్ఠికాహార పదార్థాలు, మందులు, తదితర రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. పిల్లల బరువు, ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్ధేశించిన మెనూ ప్రకారం క్రమం తప్పకుండా గర్భిణులకు, చంటి పిల్లలకు పోషకాహారం అందివ్వాలని అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు. రక్తహీనత గల గర్భిణులకు ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లు, పోషకాహార పదార్థాల కిట్లను సరఫరా చేయాలన్నారు. వీలైతే అంగన్వాడీ కేంద్రంలోనే తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల ఉన్నారు.

కొండెక్కిన కోడి ధర

- కిలో రూ.140 నుండి రూ.280
- మందగించిన అమ్మకాలు
- వ్యాపారం లేక దుకాణాలు వెలవెల

ప్రజాశక్తి - బనగానపల్లె

వేసవికాలం కావడంతో చికెను ధరలు కొండెక్కాయి. 20 రోజుల నుండి చికెను ధరలు పైపైకి పెరుగుతున్నాయి. బనగానపల్లె పట్టణంలో కిలో చికెన్ స్కిన్‌తో రూ.260, స్కిన్‌లెస్ రూ.280 ధర పలుకుతుంది. ఎండల వేడికి కోళ్లు చనిపోతుండంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో చికెన్ ధరలకు రెక్కలు వచ్చాయి. మూడు నెలల నుంచి కిలో చికెన్ 100 రూపాయల నుండి 140 వరకు ధర పెరుగుతూ వచ్చింది. ఒక్కసారిగా కిలో చికెన్ 260 పలకడంతో చికెన్ కొనడానికి మాంసం ప్రియులు వెనక్కి తగ్గుతున్నారు. దీంతో అమ్మకాలు తగ్గి వ్యాపారులు లబోదిబోమంటున్నారు. సాధరణంగా మార్కెట్లో ఒక్కో చికెన్ దుకాణంలో రోజుకు 100 నుంచి 150 కిలోలు అమ్మకాలు జరిగేవి. ధర పెరగడంతో 30 నుంచి 50 కిలోలు మాత్రమే అమ్ముడుపోతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మధ్యాహ్నం నుంచి కిలో చికెన్ 20 రూపాయలు తగ్గించినా కొనుగోలుదారులు ముందుకు రావడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. రాష్ట్రంలో కోళ్ల ఫారాలు ఎక్కువ సంఖ్యలో ఉన్నా వేసవిలో ఎండ తీవ్రతకు బ్రాయిలర్ కోళ్లు తట్టుకోలేక మత్యువాత పడుతుండడంతో ఫారాల సంఖ్య తగ్గుతోంది. కర్ణాటక రాష్ట్రంలో కాస్త ఎండ తీవ్రత తక్కువగా ఉండడంతో బ్రాయిలర్ కోళ్ల పెంపకం ఎక్కువగా ఉంటుంది. దేవనహళ్లి, టుంగూరు వంటి ప్రాంతాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపారులు తెలిపారు. గతంతో పోలిస్తే కోళ్లకు వేసే దాణా ధరలు పెరిగాయి. సోయా, మొక్కజొన్న, సజ్జలను మిశ్రమం చేసి దాణాగా తయారు చేసి కోళ్లకు అందిస్తారు. ప్రస్తుతం 50 కేజీల బస్తా 2500 ఉండగా, గత సంవత్సరం 1800 విక్రయించే వారు. దాణా ధర పెరగడంతో పాటు వేసవిలో కోళ్లు డిమాండ్ తగ్గ సప్లయ్ లేకపోవడంతో చికెన్ ధరలు కూడా రోజురోజుకు పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

చికెను కొడుతున్న వ్యాపారి

చికెన్ కొనలేకపోతున్నాం

చికెన్ ధర పెరగడంతో కొనలేకపోతున్నాం. మార్కెట్లో రేట్లు చూస్తే సామాన్య ప్రజలు చికెన్ కొనలేని పరిస్థితి తలెత్తింది. చికెన్‌కి బదులు పప్పన్నంతోనే సర్దుకుపోతున్నాం. రోజు కూలి పనికి పోతే రూ.250 నుండి రూ.300 ఇస్తున్నారు. రోజంతా కూలి పని చేస్తే చికెన్‌కే సరిపోయే పరిస్థితి తలెత్తింది. మిగిలిన సరుకులు ఎలా కొనాలో అర్థం కాక చికెన్ కొనడమే బంద్ చేశాం.

- రాంపుల్లయ్య, పలుకూరు గ్రామం.

వ్యాపారం బాగా తగ్గిపోయింది

ఎండల వేడిమికి కోళ్ల ఉత్పత్తి తగ్గింది. దీంతో చికెన్ ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మార్కెట్లో లైవ్‌కోడి ధర 230 రూపాయలు పైనే పలుకుతుంది. ఇలాంటి సమయంలో ధరలు పెరగడం మామూలే. ధరలు పెరగడంతో చికెన్ కొనేందుకు జనాలు రావడం లేదు. మధ్యాహ్నం కిలోపై రూ.20 తగ్గించినా ఎవరు కొనడం లేదు. ప్రతిరోజు వ్యాపారంలో నష్టపోతున్నాం. చికెన్ ధరలు తగ్గించాలి.

- ముక్తియార్, చికెన్ వ్యాపారి.

విత్తన, ఎరువుల ధరలు తగ్గించాలి

- రైతుల పట్ల చిత్తశుద్ధి లేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

విత్తనాలు, ఎరువుల ధరలు తగ్గించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రైతాంగం పట్ల చిత్తశుద్ధి లేదని, మాటల్లో రైతుల అభివృద్ధి గురించి గొప్పగా మాట్లాడడం తప్ప ఆచరణలో శూన్యమని విమర్శించారు. మంగళవారం నంద్యాలలోని టి.నర్సింహయ్య భవన్‌లో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ఖరీఫ్ సాగులో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలపైన ప్రభుత్వాలు కఠినంగా వ్యవహారించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పుణ్యమా అంటూ రోజు రోజుకు రైతుల ఆదాయం పూర్తిగా తగ్గిపోతుందని, పెట్టుబడి మాత్రం రెట్టింపు అవుతుందని అన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరగడం, డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదలతో ఖర్చులు పెరగడంతో పెట్టుబడి విపరీతంగా పెరిగి పోతుందని చెప్పారు. రైతాంగం పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు ప్రకటనల్లో చెప్పడం తప్ప ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. గత రెండు సంవత్సరాల నుండి ఢిల్లీ నడి వీధుల్లో మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని రైతాంగం ఆందోళన చేస్తుంటే హామీ ఇచ్చిన ప్రధానమంత్రి ఈనాటికి హామీ ఏ మాత్రం అమలు చేయలేదన్నారు. దేశంలో సుమారు 100 కోట్ల ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటే వారి ఉత్పత్తులకు రేటు నిర్ణయించుకునే అధికారం వారికి లేకుండా చేశారని అన్నారు. గతంలో ఎన్నికల కంటే ముందు ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని చెప్పిన మోడీ రైతుల అప్పులను, పెట్టుబడిని మాత్రం రెట్టింపు చేశారన్నారు. కేవలం కార్పొరేట్ శక్తుల ఆదాయాలు రెట్టింపు చేసేందుకు పరిపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రమాద కరమైన విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తూ విద్యుత్ మోటార్ల వద్ద మీటర్లు పెట్టి ఉచిత విద్యుత్‌ను ఎత్తివేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మడం వల్ల లక్షలాది ఎకరాల్లో రైతులకు నష్టం జరుగుతున్నా ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. కావున రైతులందరూ ఐక్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. రైతాంగానికి అవసరమైన పంట రుణాలను సకాలంలో బ్యాంకుల ద్వారా ఇవ్వాలని, సున్నా వడ్డీ, పావలా వడ్డీ రుణపరిమితులను పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు పెంచి ఇచ్చి వడ్డీ వ్యాపారుల వారి నుండి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. తీవ్రమైన రుణ భారంతో కుంగిపోతున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతాంగానికి అవసరమైన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వాలే అందజేయాలని కోరారు. పై సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో దశల వారి రైతు ఉద్యమాలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు సురేష్, సుబ్బరాయుడు, వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకర్ రెడ్డి

ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

వాలంటీర్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన వాలంటీర్ గౌతమ్ కుటుంబానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి రూ. 25 వేలు ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. వాలంటీర్ గౌతమ్ మూడు నెలల కిందట ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మరణించాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే వాలంటీర్ కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ. 25 వేలు నగదును మహానంది ఎంపీడీవో శివ నాగజ్యోతికి అందజేశారు.

అంబటి అంకిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని చింతలాయపల్లి మాజీ సర్పంచి అంబటి అంకిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మంగళవారం అంబటి అంకిరెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబటి అంకిరెడ్డి మతి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎర్రబోతుల ఉదయ్ భాస్కర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివి రెడ్డి, పార్టీ ప్రచార జిల్లా అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

శరవేగంగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

- ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలో చేపడుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. అనుమతి పొందిన కళాశాలల్లో నంద్యాల మెడికల్ కళాశాల వుండడం సంతోషంగా ఉందన్నారు. మంగళవారం మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు మరింత వేగవంతంగా నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి ప్రధానంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ సెగ్మెంట్లలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది విద్యా సంవత్సరం 5 మెడికల్ కళాశాలలకు అడ్మిషన్లు చేపట్టవచ్చని కేంద్ర ప్రభుత్వం అనుమతి తెలిపిందని పేర్కొన్నారు. దీంతో ఈ ఏడాది 750 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు సువర్ణ అవకాశం లభించిందని తెలిపారు. నంద్యాలలో మెడికల్ కళాశాల నిర్మాణానికి అడ్డంకులు సృష్టించినా కోర్టుల్లో కేసులు గెలిచామన్నారు. అడ్డంకులు లేకపోయింటే ఇప్పటికే అనుకున్న లక్ష్యం సాధించేవారమన్నారు. అయినా అధికారుల పర్యవేక్షణలో మరింత వేగవంతంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. దాదాపుగా మొదటి ఏడాదికి సంబంధించి అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నామని, త్వరలోనే మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు భవనాలను అప్పజెప్పాలని కాంట్రాక్టర్లను, సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రతిభను వెలికి తీసేందుకే క్రికెట్ పోటీలు

- కాటసాని తిరుపాల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె : గ్రామీణ ప్రాంతాల యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నందవరం గ్రామంలో సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.20 వేలు దాత వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి , రెండవ బహుమతి రూ.10 వేలు దాత వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా కాటసాని తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ దివంగత కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక, క్రీడా పోటీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పిఎల్.శివ లింగారెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి యూత్ సభ్యులు పాపిరెడ్డి సుదర్శన్ రెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డి, అత్తార్ అఖిల్ హుస్సేన్, విద్యా కమిటీ చైర్మన్ వెంకట రమణ, క్రికెట్ నిర్వాహకులు, కె.బాలు, పరుగు, హరి గోవిందు, నందు, నాని, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాటసాని తిరుపాల్ రెడ్డి

నాడు-నేడు పనులు పూర్తి చేయండి : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద పెండింగ్‌లో వున్న అదనపు తరగతి గదులు, టాయిలెట్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నిశాంతి డిఇఒను ఆదేశించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ, నాడు-నేడు పనులను జెసి ఆకస్మిక తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుక కిట్లను ఆమె పరిశీలిస్తూ నాణ్యతగా ఉన్నాయని అభినందించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో జాయింట్ కలెక్టర్ ముచ్చటిస్తూ బాగా చదివి విద్యలో రాణించాలన్నారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఆమె పంపిణీ చేశారు. అనంతరం నంద్యాలలోని 2వ వార్డు మాలాద్రిపేట 54వ ప్రభుత్వ చౌక దుకాణాన్ని, బాలాజీ కాంప్లెక్స్‌లోని 108వ చౌక దుకాణాలను, యండియు వాహనం ద్వారా నిత్యావసరాల పంపిణీని జెసి ఆకస్మిక తనిఖీ చేశారు. నిల్వ ఉన్న స్టాక్ వివరాలు, వినియోగదారులకు పంపిణీ చేసిన నిత్యావసర వస్తువులు, మిగిలిన స్టాక్, సంబంధిత రిజిస్టర్లను ఆమె తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నంద్యాల మండల తహశీల్దార్ శ్రీనివాసులు, పౌరసరఫరాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న జెసి

గుడ్ షప్పర్డ్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అక్షరాలతో లక్షల వ్యాపారం చేస్తు అక్రమంగా పుస్తకాలను స్కూల్ ఆవరణలోనే అమ్ముతున్న గుడ్ షప్పర్డ్ స్కూల్ గుర్తింపును విద్యా శాఖ అధికారులు తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పాఠశాలకు వెళ్లి అక్రమ అడ్మిషన్‌లు, పుస్తకాల అమ్మకాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ అవరణలో పుస్తకాలను, యూనిఫాం అమ్ముతున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని చెప్పారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు.

బిజ్జం పార్థ సారథిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అభిమానులు

అభిమానుల ఆప్యాయత మరువలేనిది

- మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థ సారథి రెడ్డి

ప్రజాశక్తి - అవుకు : అభిమానుల ఆప్యాయత, అనురాగాలు మరువలేనివని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ఎప్పటికీ కృషి చేస్తానని సీనియర్ నాయకులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధి రెడ్డి వెల్లడించారు. మంగళవారం మండలంలోని చనుగొండ్ల గ్రామంలో జరిగిన కంకర సత్యనారాయణరెడ్డి పద్మనాభ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డిల ప్రైవేట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై కార్యకర్తలు, అభిమానులు చూపిస్తున్న అభిమానం వెలకట్ట లేనిదన్నారు. కార్యక్రమంలో మారం భాస్కర్ రెడ్డి, కొలిమిగుండ్ల శివశంకర్ రెడ్డి, డీలర్ వెంకటేశ్వర రెడ్డి, వాయునందన్ గౌడ్, అభిమానులు పాల్గొన్నారు.

నేడు భజన పోటీలు

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని నెరవాడ గ్రామంలో వెలసిన లక్ష్మి చెన్న కేశవ సీతారామాంజనేయులు స్వామి సన్నిధిలో నేడు ఏకాదశిని పురస్కరించుకొని భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నాగిరెడ్డి మంగళవారం తెలిపారు. మొత్తం 8 బహుమతుల విలువ రూ. 90 వేలుగా నిర్ణయించారు. భజన పోటీలలో పాల్గొనే వారికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు 8985808343 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : నంద్యాల మండలం చాపిరేవుల గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ బడుల రూపు రేఖలు మారాయని, పిల్లలకు పౌష్టిక ఆహారం అందించడం కోసం మధ్యాహ్నం భోజనం మెనూ కూడా మార్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బ్రహ్మం, గ్రామ సర్పంచ్ బోయ రేవుల దేవి, ఎంపిపి శెట్టి ప్రభాకర్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మాట్లాడుతున్న హౌసింగ్ డిఇ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : డిఇ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలో జగనన్న లే అవుట్ లలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ డిఇ నాగరాజు కోరారు. మంగళవారం ఆయన చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సచివాలయాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణా లు నిధానంగా కొనసాగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లబ్ధిదారులతో చర్చించి ఇళ్లను పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మహబూబ్ దౌలా, ఇన్చార్జి ఈఓఆర్డి సుదర్శన్ రావు, హౌసింగ్ ఏఈ షఫివుల్లా, హౌసింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని కొర్ర ప్రోలూరు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొని రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారి మోహన్ ఎమ్మెల్యేను, జడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డిను పూలమాల శాలువతో సన్మానించారు. అనంతరం కరిమద్దెల గ్రామంలో పెద్దమ్మ తల్లి చల్లదనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుబ్బారెడ్డి, పుల్లయ్య, కాంత్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం

- అర్హుల జాబితా కోసం పరిశీలన

ప్రజాశక్తి - కొత్తపల్లి

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని ఇన్చార్జి తహశీల్దార్ పెద్దన్న తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో నేటి ముంపు గ్రామాలైన ఎర్రమఠం, సిద్దేశ్వరం, ఎదురు పాడు, బట్టు వారి పల్లి గ్రామాల్లో ఉన్న నీటి ముంపు రైతుల పత్రాలను పరిశీలన చేశారు. రైతుల పత్రాలను పరిశీలన చేసేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం నుంచి డిప్యూటీ తహశీల్దార్లు శ్రీరాధా, విజయలక్ష్మి రాజారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో

రైతుల పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

భూములు కోల్పోయిన నీటి ముంపు రైతులకు గతంలోనే పరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. అయితే గతంలో ఇచ్చిన నష్టపరిహారం సరిపోక కొంతమంది రైతులు కోర్టును ఆశ్రయించడంతో కొత్తపల్లి మండ లంలో నీటి ముంపు గ్రామాల్లో ఉన్న అర్హులైన రైతుల పత్రాలు పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. ఎదురుపాడు 208 మంది రైతులకు గాను 140 రైతుల పత్రాలు పరిశీలించామన్నారు. 68 మంది రైతుల పత్రాలు పరిశీలన చేయాలన్నారు. బట్టువారిపల్లి 98 మంది రైతులకు గాను 78 పరిశీలన చేశామని అన్నారు. ఇంకా 47 మంది రైతుల పత్రాలు పరిశీలన చేయాలన్నారు. జాబితాలో పేర్లు ఉన్న రైతులు చనిపోతే చనిపోయిన సర్టిఫికెట్ ఫ్యామిలీ మెంబర్ తీసుకొని కుటుంబ సభ్యులు రావాలన్నారు. ఈ నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది గ్రామాల రైతులు ఉన్నారు.

తప్పుడు సర్వే పై నేషనల్ హైవే పిడి పరిశీలన

ప్రజాశక్తి - పాములపాడు

మండల పరిధిలో నేషనల్ హైవే నిర్మాణంలో భూ సర్వేలో తప్పుడు నివేదికలు ఇచ్చారని గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా నేషనల్ హైవే పిడి తరుణ్ కుమార్ పరిశీలించారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 62లో 38 సెంట్లు నేషనల్ హైవేకు తీసుకునేందుకు నిర్ణయించినట్లు చూపారని, కానీ 1.11 సెంట్లు తీసుకుంటున్నట్లు ప్రస్తుతం రికార్డులో చూపడం జరిగిందన్నారు. అలాగే సర్వే నంబర్లు 152 178లో కూడా ఇలాగే జరిగిందని హరి సర్వోత్తమరావు శ్రీనివాసరావు పిడి దృష్టికి తీసుకెళ్లారు. తీసుకుంటే అంతే తీసుకుంటామని తెలిపారు. సర్వేలో మార్పులు చేసి ఇష్టానుసారంగా చేసిన అధికారులపై చర్యలు ఉంటాయ న్నారు. గత అధికారులు తప్పుడు

పరిశీలిస్తున్న అధికారులు

నివేదికలు ఇచ్చారని గ్రామస్తులు పిడి దృష్టికి తీసుకొని రాగా పది రోజుల్లో పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకుం టామని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూస్తామని పరిష్కరిస్తామని తెలిపారు. భూములు కోల్పోయిన ప్రజలందరికీ బ్యాంకు ఖాతాలో పరిహారం జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రత్న రాధిక పాల్గొన్నారు.

టిడిపిలో వైసిపి కార్యకర్తలు చేరలేదు

- మున్సిపల్ వైస్ ఛైర్మన్ జాకీర్ హుస్సేన్

ప్రజాశక్తి-డోన్

టిడిపిలో చేరినట్లు ప్రకటించిన వైసిపిలో కార్యకర్తలు జగనన్నే మా నమ్మకమని తిరిగి వైసిపిలో చేరారు. డోన్ పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన 29వ వార్డు కార్యకర్తలు మణి, రవి, చరణ్, ప్రశాంత్, కృష్ణ, మనోజ్, కిరణ్, యశ్వంత్, కిరణ్ కుమార్, బాష, హితేష్, తరుణ్‌లు సోమవారం కొంతమంది టిడిపి చెందిన నాయకులు పని ఉందని చెప్పి పిలుచుకొని పోయి మా వైసిసి కార్యకర్తలకు చెప్పకుండా వారి ప్రమేయం లేకుండానే టిడిపి కండువాలను కప్పి టిడిపిలో చేరినట్లు కొన్ని పత్రికలలో వచ్చిన వార్తలు నిజం కాదని డోన్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎస్ ఎండి.జాకీర్ హుస్సేన్ సమక్షంలో 29వ వార్డు కౌన్సిలర్ భర్త ఎం.నాగరాజు 16వ సచివాలయ కన్వీనర్ భర్త కోళ్ల శివ, కోళ్ల విజయ్ ఆధ్వర్యంలో తిరిగి వాళ్లు వైసిపిలో చేరారు. మా నమ్మకం జగనన్న మా నాయకుడు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డేనని వాళ్లను వదిలే ప్రసక్తే లేదని ఖరాకండిగా మీడియా ముందు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి పథకం నీరుగార్చి ంది చంద్రబాబు నాయుడు కాదా అని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో చెప్పిన విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దాదాపుగా లక్షా 35 వేల ఉద్యోగాలు కల్పన కల్పించి ంది నిజం కాదా అన్నారు.

దాదాపుగా మూడు లక్షల వాలంటీర్లకు గౌరవ వేతనంగా నెలకు రూ. 5000 ఇస్తున్నది నిజం కాదా? కాంట్రాక్టు ఉద్యోగ విధానాన్ని రద్దుపరిచి ఆప్కాస్ విధానంలో అవుట్ సోర్స్ ఉద్యోగ కల్పన ద్వారా దాదాపుగా ఈరోజు వరకు 50 వేల ఉద్యోగాలు ఇచ్చింది నిజం కాదా? మరి మాట తప్పింది మడమ తిప్పింది చంద్రబాబు కాదా? అన్నారు.

పురావస్తు శాస్త్రం కోర్సుకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లోపురావస్తు శాస్త్రం ప్రథమ సంవత్సరం కోర్సుకు దరఖాస్తు చేసుకో వాలని విశ్వవిద్యాలయం పీఠాధిపతి ఎం శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్రం కోర్సులు ఉన్నాయని, 2023-24 విద్యా సంవత్సరానికి పిహెచ్‌డి, ఎంఏ హిస్టరీ - ఆర్కియాలజీ, ఎంఏ చరిత్ర- పురావస్తు శాస్త్రం కోర్సు ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కొరకు అభ్యర్థులు www.pstucet.org.(www.TeluguUniversity.ac.in) ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ వరకు ఎలాంటి లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అపరాధ రుసుముతో ఈనెల 30వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని పీఠాధిపతి ప్రకటనలో సూచించారు. బిఏ, బి కామ్, బిఎస్సి, మరి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎవరైనా ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చునని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పిహెచ్‌డిలో 9 సీట్లు, ఎంఏలో 40 మందికి ప్రవేశం ఉంటుందని ఆయన తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులం దరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఠాధిపతి తెలి పారు. మరింత సమాచారం కోసం పీఠాధిపతి చరవాణి 9441370591, కార్యాలయం చరవాణి 9989240806కు సంప్రదించాలని పేర్కొన్నారు.

పథకాలు అందించడంలో వాలంటీర్లు భేష్

ప్రజాశక్తి - ఆత్మకూర్

అర్హులకు పథకాలు అందించడంలో గ్రామ, వార్డు వాలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయం అని శ్రీశైలం సభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మంగళవారం నాడు స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణం నందు వాలంటీర్లు అభినంద సభ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో వాలంటీర్లు సాహోసోపేతమైన విధి నిర్వహణలో పనిచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వానికి లబ్ధిదారులకు వారధిగా వేరు సేవలు అందించారన్నారు. అందుకే ప్రతి సంవత్సరం వాలంటీర్లకు వివిధ రూపాలలో వారిని ప్రోత్సహించేందుకు ఈ ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన అన్నారు. మరో 9 నెలలు ఎన్నికల రాబోతున్న నేపథ్యంలో జగనన్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వాలంటీర్లు కలిసి పనిచేయాలని వాళ్ల సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకు రు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, కమిషనర్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో మోహన్ కుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి, సింగల్ వీడియో అధ్యక్షుడు సురేష్, కౌన్సిలర్ విజయ్ చౌదరి, లక్ష్మమ్మ, బోయ పార్వతి, వివిధ వార్డు కౌన్సిలర్లు పువ్వాడి భాస్కర్, వైసిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు అభినందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

అన్నప్రసాద పథకానికి విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానం భక్తులకు అందిస్తున్న నిత్య అన్నదాన పథకానికి మంగళవారం నాడు పలువురు భక్తులు విరాళాలు అందించారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌కు చెందిన వృద్ధరాజు సోమరాజు తమ కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,00,116లు , పశ్చిమగోదావరికు చెందిన గారపాటి అనంతలక్ష్మి కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,00,008 లు అన్నప్రసాద పథకానికి విరాళంగా దేవస్థానం ఎఇఒ ఫణిదరు ప్రసాద్ కు అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా దేవస్థానం అధికారులు తెలిపారు.

దాతలను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో

థెరిసా కళాశాల విద్యార్థులు ప్రతిభ

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మొదటి సంవత్సర ఫలితాల్లో ఆత్మకూరు పట్టణంలోని థెరిసా జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించడం జరిగిందని ప్రిన్సిపల్ హరికృష్ణ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఎంపీసీ విభాగం నందు సి. పవన్ 461, డి. రియాజ్ 460, ఎం. మమత 448, బి. సాహితి 423 మార్కులు సాధించారని అన్నారు. బైపీసీ విభాగంలో జి. మంజుల 424/440, ఎస్. ఇఫత్ భాను 416/440, సనా ఫాతిమా 416/440 మార్కులు సాధించగా, సిఇసి విభాగంలో సిద్ధార్థ 433/500, సంతోష్ 410/500 మార్కులు సాధించారని తెలిపారు. 1994వ సంవత్సరంలో శ్రీమతి థెరిసమ్మ ప్రారంభించబడిన విద్యాసంస్థ ఆత్మకూరు పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా స్టేట్ ర్యాంకులు సాధిస్తోందన్నారు. దాదాపు 20 సంవత్సరాలు అనుభవం కలిగిన అధ్యాపకులచే నడపబడుతున్న విద్యాసంస్థ అని అన్నారు. కళాశాల యాజమాన్యం ఆదిమూలపు సతీష్ విద్యార్థులకు, స్టాఫ్‌కు అభినందనలు తెలియజేశారు.

స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

ఆర్‌టిసి ఆదర్శ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు ఆర్‌టిసి డిపో ఆదర్శ ఉద్యోగులను డిపో మేనేజర్ మహేంద్రుడు ఘనంగా సన్మానించారు. మంగళవారం నాడు ఆత్మకూరు ఆర్‌టిసి డిపో గ్యారేజ్ ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. అత్యధిక డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లు ఎస్ఆర్ రెడ్డి, ఏపి రజాక్‌కు, అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు బాలు నాయక్, రంగ స్వామి, షఫీఉల్లాకు ప్రోత్సాహక బహుమతులు డిపో మేనేజర్ మహేం ద్రుడు అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ ఉద్యోగులు అందరూ వీరిని ఆదర్శంగా తీసుకొని డిపోని లాభాల బాటలో నడిపించాలని డిపో మేనేజర్ కోరారు.

కార్మికులను అభినందిస్తున్న డిపో మేనేజర్ మహేంద్రుడు

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

టిడిపి నేతలు వాస్తవాలు మాట్లాడాలి : వైసిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

తెలుగుదేశం పార్టీ నాయకులు అభివృద్ధి గురించి నిజాలు తెలుసు కొని మాట్లాడాలని బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. స్థానిక మండల కేంద్రంలోని శేషారెడ్డి హైస్కూల్ నందు మంగళవారం నాడు ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిపై టిడిపి నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదని వారు హెచ్చరించారు. డోలు ప్యాపిలి బేతంచెర్ల మండలాలలో అభివృద్ధి ఎంత జరిగిందో ప్రస్తుతం ఏం జరుగుతుందో తెలుగుదేశం పార్టీ నాయకులు కళ్ళు ఉండి అభివృద్ధిని చూడలేని గుడ్డి వారు కావడం దురదృష్టం అని అన్నారు. గత 30 సంవత్సరాల క్రితమ్ బేతంచర్లను పట్టించుకునే నాధుడే లేడని, ప్రస్తుతం బేతంచెర్ల నివాసి డోలు నియోజకవర్గ శాసనసభ్యులుగా ఎన్నికైన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఒక బేతంచర్లనే కాకుండా డోన్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం మన అదృష్టమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వద్దు అకాడమీ కమిటీ మూర్తి జావలి, గూని నాగరాజు, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మురళి, రుద్రవరం నారాయణ, తిరుమలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని విద్యానగర్లో శీను ఆర్ట్స్ అకాడమీ సమ్మర్ డ్రాయింగ్ శిక్షణా తరగతులను డ్రాయింగ్ మాస్టర్స్ దేశెట్టి శ్రీనివాసులు, దేశెట్టి హారిక ఆధ్వర్యంలో క్షణా తరగతులను నిర్వహించారు. మంగళవారం శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ నవనంది హైస్కూల్ కరస్పాండెంట్ బద్దుల శ్రీధర్,జవ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రలేఖనము, ఆర్ట్స్ రంగంలో అపార అనుభవం కలిగిన దేశెట్టి శ్రీనివాసులు తన నైపుణ్యం, కళను ఇతర విద్యార్థులకు అందించాలన్న ఆకాంక్ష గొప్పదని కొనియాడారు. 45 రోజుల శిక్షణలో విద్యార్థులు విభిన్న ప్రతివను కనబరిచారని భవిష్యత్తులో మరిన్ని విద్యార్థులకు శ్రీను ఆర్ట్స్ అకాడమీ ద్వారా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అనంతరం శిక్షణ తరగతులు ప్రతిభ చూపిన విద్యార్థులు మొదటి బహుమతి అక్షయ్ వర్మ, రెండవ బహుమతి బషీర్,మూడవ బహుమతి గీతా శ్రీ,ప్రణీత,సాయిశ్రీ, లక్ష్మీ శ్రీ, అక్షయ వర్మ, రేఖ, సురేష్, తదితరులకు మెమొంటో సర్టిఫికెట్లను అందించారు.

- ప్రతిభ కనబరిచిన శీను ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు

కార్మికులు కలిసికట్టుగా ఉండాలి

నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నంద్యాల జిల్లా రీజినల్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రావు

ప్రజాశక్తి-డోన్

కార్మికులందరూ కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నంద్యాల జిల్లా రీజినల్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రావు అన్నారు. మంగళవారం డోన్ పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్ నందు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సమావేశం నంద్యాల జిల్లా రీజినల్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా రీజినల్ చైర్మన్ కోటేశ్వరరావు,కార్యదర్శి కె.శివరం,రీజినల్ ప్రచార కార్యకర్త డివిఆర్ రెడ్డి లు హాజరయ్యారు.అనంతరం డోన్ డిపో గ్యారేజీని సందర్శించి ఉద్యోగులను పలకరించారు. డిపోలో ఉద్యోగ సమస్యలు,మహిళా ఉద్యోగ సమస్యలు, అక్రమచార్జిసీట్లు యాజమాన్య వేధింపులు,డ్యూటీ వేయడంలో ఏకపక్ష నిర్ణయాలను గురించి కార్మికులు తెలియజేశారు. ఈ సందర్భంగా రీజనల్ కార్యదర్శి కే శివరాం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో కలిపిన తర్వాత వచ్చే సమస్యలకు పరిష్కరించాల్సి నటువంటి వ్యవస్థ నేటికి లేదని, పరిష్కారం కోసం పైస్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కరించుకో వాలన్నారు. పనిష్మెంట్లను ఒకేసారి అందరూ కలిసి అధికారులు ఇచ్చిన సమయంలోనే వారి ముందు ఉంచాలని, దీనికి మన పరిధిలోనే పోరాటం చేయాలన్నారు. ఒక క్రమశిక్షణ కలిగినటువంటి యూనియన్‌గా ఈ బాధ్యత అందరి ఉద్యోగుల మీద ఉందని తెలిపారు. అనంతరం రీజినల్ చైర్మన్ కోటేశ్వరరావు, రీజనల్ ప్రచారకర్త అయిన డివిఆర్ రెడ్డి మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు అందరికీ చైర్మన్ రామకృష్ణ కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో డోన్ డిపో అధ్యక్షుడు సీతారాం రెడ్డి,డిపో కార్యదర్శి ఆబి మద్దయ్య,కోశాధికారి మద్దిలేటి,గ్యారేజీ ప్రెసిడెంట్ రామకృష్ణ, గ్యారేజీ కార్యదర్శి జి మాధవస్వామి, ఎన్ఎంయుఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె.సుదర్శన్ రావు

ప్రమాద బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామార్శ

నగదు అందజేస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - వెలుగోడు

ఇటీవల కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ దర్గాకు వెళ్తూ ప్రమాదం బారిన పడిన వెలుగోడు గ్రామ బాధితులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మంగళ వారం పరామర్శించారు. స్వతహాగా సేవ సహృదయంతో స్పందిం చి రూ. 3 లక్షల 50 వేలను బాధితులకు అందజేశారు. గాయాల పాలై హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని హాస్పటల్ యాజమాన్యానికి ఎమ్మెల్యే శిల్పా చక్ర పాణి రెడ్డి తెలిపారు. ప్రజాప్రతి నిధులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమంలో రాష్ట్రం దేశానికి ఆదర్శం : ఎమ్మెల్యే

ప్రజా శక్తి - చాగలమర్రి

సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మన రాష్ట్రంను దేశంలోనే ఆదర్శంగా నిలిపారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చాగలమర్రి పట్టణంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం కు విచ్చేసిన ఎమ్మెల్యేకి వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,ఎంపిపి వీరభద్రుడు,వైసిపి నాయకులు,కార్యకర్తలు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోహెల్,వైస్ ఎంపిపి రఫి, ఎంపిటీసిలు పత్తి నారాయణ,లక్ష్మిరెడ్డి,ఫయాజ్,చక్రం బీడి షబ్బీర్,మార్కెట్ యార్డు డైరెక్టర్ జాబీర్, షబ్బీర్,ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫి, ఖాదర్‌బాష, బ్రాందీన్,సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,జగదీశ్వర్ రెడ్డి,వెంకట రమణ,ఆర్ఎస్ రమణ, గేట్లమాబు,మదార్‌వలి,నాయబ్,ఐడియా బాబు, నాగేంద్ర,రమణారెడ్డి, అబ్దుల్లా,పగిడాలబాబు,ఇబ్రహీం, కొండయ్య,,ఎంపిడీఓ మహబూబ్‌దౌలా, ఏఓ రంగనేతాజి, ఎంఈఓ అనురాధ, ఏఈలు కొండారెడ్డి,షాజహాన్, షఫివుల్లా,ఈఓ సుదర్శనరావు,ఏపిఓ నిర్మల, అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ను వివరిస్తున్న ఎమ్మెల్యే

వాల్మీకి సాధికార సమావేశం లో గౌరు చరిత,టిడిపి నాయకులు

సిబ్బంది అందుబాటులో ఉండాలి : ఎఒ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని వ్యవసాయ కార్యాలయం, ఆర్‌బికె సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున వ్యవసాయ సిబ్బంది ఆర్‌బికెలోనే ఉంటూ రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి ఆర్‌బికెలో జీలుగ విత్తనాలు సబ్సిడీ ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి ఆర్‌బికెకు 80 మట్టి నమూనాలు సేకరించాలని నిర్ణయించామని, కావున గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మట్టి నమూనా సేకరించి వాటిని ల్యాబ్‌కి పంపాలన్నారు. వాటి ద్వారా వచ్చే సాయిల్ హెల్త్ కార్డ్స్‌ని రైతులకు పంపిణీ చేసి తగిన ఎరువులు మోతాదుని పాటించి పంటను, నేలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రాజు, ఆర్.బి.కె సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ

టిడిపి హయాంలోనే బిసిల అభ్యున్నతి : గౌరు చరిత

ప్రజాశక్తి - పాణ్యం

టిడిపి హయాంలోనే బిసిల అభ్యున్నతికి పెద్దపీట వేశారని పార్టీ పాణ్యం నియోజకవర్గం ఇంఛార్జి గౌరు చరిత అన్నారు. మంగళవారం పాణ్యంలోని టిడిపి కార్యాలయంలో జరిగిన బోయ, వాల్మీకి సాధికార సమితి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుల వృత్తుల వారికి ఆదరణ పథకం ప్రవేశపెట్టిన ఘనత టిడిపిదని అన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే బోయ,వాల్మీకి కులస్తులను ఎస్‌టిలోకి చేర్చేలా చంద్రబాబు నాయుడు కృషి చేస్తారని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు జయ రామిరెడ్డి, మల్లు రామ గోవింద రెడ్డి, లాయర్ బాబు, రమణమూర్తి, గుజ్జుల యల్లా సుబ్బయ్య, శేఖర్ నాయుడు, రవి, విజయ్ కుమార్, రామాంజనేయులు, రామకృష్ణ, మల్లికార్జున, గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరికీ ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలన్నీ అందించాలని ఎంపీడీవో మేరీ తెలిపారు. మంగళవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఉన్న సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలు అర్హులైన ప్రజలకు అందించాలన్నారు. సచివాలయం అధికారులు గ్రామ వాలంటీర్లు ముందుగా గ్రామాల్లో ఏ పథకానికి ఎవరు అర్హులవుతారు జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న సర్వేలను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడికి పంపించాల్సిన బాధ్యత అందరిదీ అన్నారు. కార్యక్రమంలో సచివాలయం అధికారులు గ్రామ వాలంటీర్లు ఉన్నారు.

సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఉపాధి హామీ పనుల తనిఖీ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని కె ముచ్చుమర్రి, పి ముచ్చుమర్రి గ్రామాల్లో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎంపీడీవో వెంక టరమణ మంగళవారం తనిఖీ చేశారు. మస్టర్లను తనిఖీ చేసి కూలీలు ఎంతమంది హాజరయ్యారని, టెక్నికల్ అసిస్టెంట్ అను, మేటిలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. పనిలో చేరిన వెంటనే కూలీలతో మాస్టర్లలో సంతకాలు చేయించుకోవాలని సిబ్బందికి సూచించారు. కూలీలు కొలతల ప్రకారం పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. కొలతల ప్రకారం పని చేస్తే ప్రభుత్వా నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి వేతనము అందుతుందని కూలీలకు సూచించారు. పనులలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వసుంధర, మేటీలు తదితరులు పాల్గొన్నారు.

మస్టరును పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరమణ

టిడిపి నాయకుడికి బిసి రాజారెడ్డి పరామర్శ

పజాశక్తి - బనగానపల్లె : మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు బాలకృష్ణను పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి మంగళవారం పరామర్శించారు. బాలకృష్ణ కొన్ని రోజుల క్రితం పక్షవాతానికి గురై వైద్యశాలలో చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న బిసి రాజారెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ నంద్యాల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కొండు భూషన్న, నాయకులు సిబి కృష్ణుడు, విష్ణువర్ధన్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నాయకున్ని పరామశిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి